## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీలో మైనార్టీ నేతల చేరిక



మైనార్టీ నేత మునాఫ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

**ఆత్మకూరు:** పట్టణంలోని 16వ వార్డుకు చెందిన మైనార్టీ నేత మునాఫ్ తన వర్గంతో మంగళవారం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరే వారికి భవిష్యత్‌లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ముతీవర్, జమీర్, కలాం, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, గంధళ్ల లక్ష్మీ, కొండా వెంకటేశ్వర్లు, ప్రకాష్, కౌన్సిలర్లు పి పెంచలయ్య, కామాక్షయ్య నాయుడు, శివ కోటారెడ్డి, పూనూరు రమేష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

### సంగమేశ్వరుడికి ఏకాంత సేవ

- ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఏకాంత సేవలో సంగమేశ్వరస్వామి

**సంగం:** త్రివేణి సంగమంలో కొలువైన సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు సోమవారం అర్ధరాత్రితో ముగిశాయి. 15 రోజులు వివిధ వాహనోత్సవాలు నిర్వహించారు. కల్యాణ ఘట్టం తర్వాత కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామికి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి దంపతులకు ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీంద్రబాబు, ప్రధాన అర్చకులు టంగుటూరు గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా హనుమంత సేవ



ఆత్మకూరురూరల్: హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

**ఆత్మకూరురూరల్:** శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గండ్లవేడులో మంగళవారం స్వామి, అమ్మవార్లకు హనుమంత సేవ వైభవంగా నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు నైవేద్యాలతో మంగళహారతులు పట్టారు.

### వైభవంగా గరుడ వాహన సేవ



గరుడ వాహనంపై రాములోరు

**ఆత్మకూరు:** శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సుందరమ్మ కోదండ రామాలయంలో రెండో రోజు సోమవారం రాత్రి రాములోరు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాములోరి ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించి గరుడ వాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మేళతాళాలు, బాణాసంచ వేడుకల నడుమ స్వామివారి గ్రామోత్సవం వైభవంగా సాగింది.

### ఎన్నికల సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలి

**వరికుంటపాడు:** సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నియమించిన సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని మండల సహాయ ఎన్నికల అధికారి అరుణాదేవి, ఎంసీసీ నోడల్ అధికారిణి తోట వెంకట కృష్ణకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సెక్టోరల్ అధికారులు, బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వసతులను సంబంధిత అధికారులు పరిశీలించుకోవాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు వసతులు కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ మండలంలోని తోటలచెరువుపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు.

# జైత్రయాత్రకు సిద్ధం

- అట్టహాసంగా 18న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు
- భారీగా తరలిరానున్న కార్యకర్తలు, నాయకులు, అభిమానులు



**కావలి:** ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సార్వత్రిక సమరానికి 'సిద్ధం' అయ్యారు. కావలి రెండో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా జైత్రయాత్రతో చరిత్ర లిఖించేందుకు సన్నద్ధమవుతున్నారు. నిగర్విగా పేరు తెచుకున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈ నెల 18న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, కందుకూరు పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి తొలి ఘట్టాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలిరానుండడంతో అందుకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

**ఇదీ ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రస్థానం**

కావలి పట్టణం పాతూరులో మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చెన్నైలో ఇంజినీరింగ్ చేసి, వ్యాపార రీత్యా బెంగళూరులో స్థిర పడ్డారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఆర్థికంగా అంచెలంచెలుగా ఎదిగిన ఆయన పుట్టిన గడ్డపై మమకారంతో కావలికి తిరిగి వచ్చారు. నాణ్యమైన ఇంజినీరింగ్ చదువుల కోసం తనలాగా ఎవరూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కడనూతల వద్ద జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆర్ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలను, ముసునూరు సమీపంలో ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను నిర్మించారు. కావలిలో అధునాతనమైన ఆర్ఎస్సార్ కళ్యాణ మండపాన్ని నిర్మించాడు. కావలి కనకపట్నం అవుతుందని చిన్నప్పటి నుంచి వింటున్న మాట నిజం చేయాలనే ఆశయంతో రాజకీయాల్లో రావాలని భావించారు. అప్పుడే పుట్టిన ప్రజారాజ్యం పార్టీ తరపున 2009లో కావలి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. రాజకీయాలకు తను కొత్త కావడం, ప్రజారాజ్యం పార్టీ ప్రజలను ఆకర్షించలేకపోవడంతో ఓటమి పాలయ్యారు. 2011లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలో చేరి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కేవలం ఏడు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ రెండు ఎన్నికల్లో ప్రతాప్‌కుమార్ రెడ్డి పరాజయం పొందినా సొంతూరైన కావలికి, ప్రజలకు దూరం కాలేదు. పార్టీ నేతగా సేవలు అందించారు. దీంతో 2014 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలి టికెట్ ప్రతాప్‌కుమార్‌రెడ్డికే ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా నిరాడంబరతగా, నిగర్విగా ప్రజాసేవకుడిగా ప్రజల్లో ఒకడిగా మమేకమయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకపోవడంతో ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి అభివృద్ధి కోసం పోరాటాలు చేశారు. ప్రధానంగా దశాబ్దాలుగా కలగా మిగిలిన రామాయపట్నం పోర్టు, దగదర్తి ఎయిర్‌పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కోసం ఆనాటి టీడీపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వీటిని నిర్మిస్తామని ప్రజల్లో నమ్మకాన్ని పెంచారు. దీంతో 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి టికెట్ ప్రతాప్‌కుమార్‌రెడ్డికే ఇవ్వడంతో ప్రజాదరణతో గెలుపొందారు. ప్రజలు, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిత్యం అందుబాటులో ఉంటూ తన విజన్‌లోని రామాయపట్నం పోర్టు, దగదర్తి ఎయిర్‌పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కృషి చేశారు. మత్స్యకారుల తలరాతలు మార్చే ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేశారు. రామాయపట్నంపోర్టు నాలుగు బెర్త్‌ల తొలిదశ పనులు పూర్తి చేయగలిగారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి టీడీపీ సృష్టించిన భూకుంభకోణం కారణంగా జాప్యం జరిగింది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డికే మూడోసారి అవకాశం ఇవ్వడంతో ముందుగా టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంది ప్రజలే. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రతాప్‌కుమార్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రజలు స్వచ్ఛందంగా ప్రచారం ప్రారంభించారు.

**కలిసొచ్చిన కాలం**

2014, 2019 ఎన్నికల్లో ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ప్రత్యర్థులుగా పోటీ చేసిన బీద మస్తాన్‌రావు, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో ఒకే పార్టీలో ఉండడం కలిసొచ్చిన కాలంగా చెప్పొచ్చు. ప్రతాప్‌కుమార్‌రెడ్డికి భారీ మెజార్టీ లక్ష్యంగా బీద, కాటంరెడ్డితో పాటు మరో సీనియర్ నేత మన్నెమాల సుకుమార్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తమ భుజస్కంధాలపై వేసుకుని అహర్నిశలు శ్రమిస్తున్నారు.

### నామినేషన్ ప్రక్రియకు పటిష్ట బందోబస్తు

**ఉదయగిరి:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న నామినేషన్ల స్వీకరణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియకు ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సిఐలు, ఆరుగురు ఎస్సైలు, యాభై మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. ప్రధాన అభ్యర్థుల నామినేషన్ రోజున వాహనాలను జాతీయ రహదారి మీదుగా రాకపోకలు జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అభ్యర్థుల ర్యాలీ వాహనాలను ఏబీఎం కాంపౌండ్ వద్దనే నిలిపివేస్తామన్నారు.

### తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**చేజర్ల:** వేసవిలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్చించారు. మంగళవారం మండల పరిషత్ సాధారణ సమావేశం జరిగింది. వేసవి దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు



ఆత్మకూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన యువత

**ఆత్మకూరు:** పట్టణంలోని 21వ వార్డు ఉలవదిబ్బ, 3వ వార్డు జేఆర్‌పేటకు చెందిన సుమారు 70 మందికిపైగా యువత ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం పట్టణ జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు తోడు విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో విద్యార్థులకు, యువతకు జగనన్న అందిస్తున్న పథకాలతో ఆకర్షితులైన యువత పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, పార్టీ నాయకులు నోటి వినయ్‌కుమార్ రెడ్డి, పూనూరు రమేష్‌రెడ్డి, ముతీవర్, సయ్యద్ జమీర్, జయపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు పి పెంచలయ్య, కొప్పోలు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మా మామయ్యకు ఒక్క అవకాశమివ్వండి

- ఇంటింటి ప్రచారంలో కోడలు నిహారిక



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నిహారిక, తదితరులు

**ఉదయగిరి:** ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మా మామయ్య మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క అవకాశమిచ్చి ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తారని ఆయన కోడలు నిహారికారెడ్డి, మనుమరాలు హైరారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉదయగిరిలోని బీసీ కాలనీ, స్టేట్‌పేటలో మంగళవారం సాయంత్రం ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. పేదలు బాగు పడాలంటే మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాల్సిన అవసరముందన్నారు. టీడీపీ నేతల ప్రలోభాలకు లొంగకుండా ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ రామాంజనేయులు, ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మూలె వినయ్‌రెడ్డి, గడియాల్చి ఎస్దాని, ఉప్పుటూరి శ్రీను, కృష్ణంపల్లి సర్పంచ్ అక్కి ప్రమీల, తదితరులున్నారు.

## అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



చేజర్ల: బిల్లుపాడులో ఎంపీపీ తూమాటి ప్రచారం



సంగం: వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం

వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా స్థానిక నేతలు ఆయా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు మేకపాటి విక్రమ్ రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఎందుకు గెలిపించాలో ప్రజలకు వివరించారు. – సాక్షి నెట్ వర్క్



ఆత్మకూరు: 19వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మహిళా కౌన్సిలర్లు, తదితరులు



సోమశిల: మంచాలపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, నేతలు



ఆత్మకూరురూరల్: అప్పారావుపాళెంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఏఎస్‌పేట: పందిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దుత్తలూరు: ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, దొంతిరెడ్డి తదితరులు

### యువకుడిపై దాడి

**బిట్రగుంట:** బోగోలు మండలం సిద్ధనపాళెంకు చెందిన శ్రీహరి అనే యువకుడిపై వ్యక్తిగత కారణాలతో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధితుడి కథనం మేరకు శ్రీహరి రాత్రి పది గంటల సమయంలో గ్రామంలోని ఓ దుకాణం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. తలపై రక్తగాయం కావడంతో అక్కడి నుంచి తప్పించుకున్న శ్రీహరి కావలి ఏరియా ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందాడు. బిట్రగుంట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారిస్తున్నారు.

### వసతుల కల్పన బాధ్యత మీదే



మాట్లాడుతున్న ఏఈఆర్వో నెహ్రూబాబు

**ఉదయగిరి:** ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల్లో వసతులు సరిచూసుకోవాల్సిన బాధ్యత బీఎల్వోలు, సెక్టోరల్ అధికారులదే అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏఈఆర్వో నెహ్రూబాబు ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు.

### మ్యాపింగ్ తప్పనిసరిగా చేయాలి

**ఉదయగిరి:** మండలంలో చదువు పూర్తయి పాఠశాలలు విడిచి వెళ్లే విద్యార్థులకు తప్పనిసరిగా స్కూల్ మ్యాపింగ్ చేయాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని కుర్రపల్లి, నేలటూరు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏఏ పాఠశాలల్లో చదివారో వివరాలను ఫైల్డ్ ఇన్ఫో సైట్‌లో మ్యాపింగ్ చేయాల్సి వుందన్నారు. ఆయన వెంట హెచ్ఎంలు సుభాషిణి, షేక్ షఫీ అహ్మద్ ఉన్నారు.

### అగ్ని ప్రమాదాలపై అవగాహన

**ఆత్మకూరు:** ఆత్మకూరు అగ్నిమాపక శాఖ అధికారి టి రమేష్‌బాబు అగ్ని ప్రమాదాలపై టిడ్కో గృహాల వద్ద మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వంట చేసే సమయంలో శిల్క్ వస్త్రాలు ధరించరాదని సూచించారు. చిన్నపిల్లలను వంట చేసే సమయంలో దూరంగా ఉంచాలన్నారు. గ్యాస్ సిలిండర్లు లీకైతే అరికట్టే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో సిబ్బంది కె శ్రీనివాస రావు, ఎ. సుధాకర్‌రావు, రబ్బానీ బాషా, రమేష్, తదితరులు ఉన్నారు.

### బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**దుత్తలూరు:** మండలంలోని చింతలగుంటలో పాముకాటుకు గురై మృతి చెందిన విద్యార్థి శివ రామకృష్ణ కుటుంబానికి విశ్వతేజ పాఠశాల యాజమాన్యం మంగళవారం ఆర్థిక సాయం అందించింది. పాఠశాల కరస్పాండెంట్ డి.వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### సమస్యలు పరిష్కరించండి

**ఉదయగిరి:** అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మంగళవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రజియా ఆధ్వర్యంలో సీడీపీఓ పచ్చవ లావణ్యకు వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ సమ్మె కాలంలో 42 రోజులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, ఫరిద్దీన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

- ఈసీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- ఆర్ఓ, ఆర్డీఓ కె మధులత



ఆత్మకూరు ఆర్ఓ కార్యాలయం ఎదుట నామినేషన్ల ప్రక్రియ కోసం చేపట్టాల్సిన విధానాలపై అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఆర్ఓ, ఆర్డీఓ మధులత

**ఆత్మకూరు:** సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గ అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కె మధులత తెలిపారు. నూతన మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఓ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. అక్కడే నామినేషన్ల ప్రక్రియ ఉంటుందన్నారు. మంగళవారం ఆమె అధికారులతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్‌కే ఫజులుల్లా, తహసీల్దారు, శివకృష్ణారెడ్డి, సీఐ జి వేణు, ఎస్సై కె ముత్యాల రావుతో కలిసి ఆమె కార్యాలయ పరిసరాలు పరిశీలించారు. 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కేవలం అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుందన్నారు. ఎలాంటి వాహనాలు కార్యాలయ ప్రాంగణంలోకి వచ్చేందుకు అనుమతి లేదన్నారు. 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్ దాఖలు ఉండదన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఆమె వివరించారు. 26వ తేదీ స్క్రూటిని చేపడుతామన్నారు. 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉందని ఆమె వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అభ్యర్థులతో సహా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇందు కోసం సజావుగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణ కోసం పోలీసులతో పాటు అదనపు బలగాలను సిద్ధం చేశామన్నారు.

## టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు



నారాయణపురం, సిరిపురం యువకులను పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



చెన్నాయపాళెం నేతను పార్టీలో ఆహ్వానించిన ఎమ్మెల్యే

**కావలి :** కావలి నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ వలసలు జోరందుకున్నాయి. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మన్నెమాల సుకుమార్ రెడ్డి లు ప్రజల్లో మంచి పేరు ఉన్న కుటుంబాలను, నాయకులను గుర్తించి వైఎస్సార్‌సీపీలోకి ప్రోత్సహిస్తున్నారు. కొన్ని ఒత్తిళ్లతో పొరపాటున టీడీపీలో చేరిన వారిని కూడా తిరిగి పార్టీలోకి తెచ్చేందుకు ఆహ్వానిస్తున్నారు. ముఖ్యంగా కరుడు కట్టిన టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీలో చేరుకోవడంపై వీరు ప్రధానంగా దృష్టి పెట్టి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ సానుకూల ఫలితాలు సాధిస్తున్నారు. రెండు రోజుల క్రితం టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ మద్దతుదారులుగా ఉన్న కావలి మండలం అన్నగారిపాళెం పంచాయతీ వెంకటేశ్వరపురం ఊరు ఊరంతా 300 కుటుంబాలు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరారు.

**యువత టీడీపీకి గుడ్‌బై**

కావలి మండలం నారాయణపురం, సిరిపురం గ్రామాలకు చెందిన 30 మంది యువత టీడీపీకి గుడ్‌బై చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేత బలరాం ఆధ్వర్యంలో పరుసు గోపి, గండ్లూరి సాయికుమార్, పరుసు బలరాం, కిశోర్, శ్రీను, విఘ్నేష్, చరణ్, హేమంత్, కళ్యాణ్, భాను, సంతోష్, ఆనందరావు, శ్రీను తదితరులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. చెన్నాయపాళెంకు చెందిన స్థానిక టీడీపీ నేత వెంకట్రావు వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు.



పార్టీలో చేరిన బీజేపీ నాయకుడితో విష్ణువర్ధన్‌రెడ్డి



పలువురి నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న విష్ణు

**విష్ణు సమక్షంలో..**

కావలి చెందిన పఠాన్ మహ్మద్ హనీఫ్, తిరుమల రెడ్డి, బీజేపీ నేత బుజ్జి వెంకట్రావు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి విష్ణు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, గోసల గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేము ఎప్పటికీ జగన్ అభిమానులమే

- బలవంతంగా టీడీపీ కండువాలు కప్పారు



అభినవ్‌రెడ్డిని కలిసి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్న తూర్పురొంపిదొడ్ల ఎస్సీ కాలనీవాసులు

**వరికుంటపాడు:** తాము ఎప్పటికీ జగన్ అభిమానులమేనని మండలంలోని తూర్పురొంపిదొడ్ల ఎస్సీ కాలనీ స్పష్టం చేశారు. కాలనీలోని పలువురు వైఎస్సార్‌సీపీ అభిమానులకు మంగళవారం టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ పార్టీ బలవంతంగా కండువాలు కప్పారంటూ వారు దుత్తలూరు వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో సాయంత్రం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తనయుడు అభినవ్‌రెడ్డిని కలిసి జరిగిన విషయం వివరించి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పించుకున్నారు. వారు మాట్లాడుతూ టీడీపీ నేతలు కాలనీలోకి వచ్చి మమ్మల్ని పిలిచి మాకు టీడీపీ కండువాలు బలవంతంగా కండువాలు కప్పారని తెలిపారు. తామెప్పుడూ జగనన్న అభిమానులమేనని, మా ఓటు ఫ్యాను గుర్తుకేనని తేల్చి చెప్పారు. టీడీపీ నేతలు బలవంతంగా పార్టీ కండువాలు కప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ అలిఅహ్మద్, ఎం.తిరుపతినాయుడు, బత్తిన కొండమ్మ, తదితరులున్నారు.